ఈ కొలమానంతో కొలిచిచూస్తే పరుగెత్తి పాలేకాదు, ఇంకా ఏమైనా కూడా త్రాగుతాను అనే ధీమా, సాహసం ప్రతి వ్యక్తిలోనూ వుండాలి. అంతేగాని, 'నేను పరుగెత్తి పాలు త్రాగలేను-నించుని నీళ్లే త్రాగుతాను' అని గాని ఎవరైనా అన్నట్టయితే 'ఓరి చవటపెయ్యమ్మా! నీవు నీళ్ళు త్రాగడానికి కూడా తాహతులేదురా' అని కరవొస్తుంది ప్రపంచం.

పెద్దపులిమీద స్వారిచేసేవాడు భూమ్మీద నడవలేనిమాట నిజమే. కాని. పెద్ద పులిమీద స్వారీచేసేవాడినీ భూమ్మీద నడిచేవాడినీ ఇద్దర్నీ బాగా నిశితంగా పరీక్షించి చూడండి-భూమ్మీద నడిచెవాడు హడిలడిలిపోతూ రోడ్డు ప్రక్కగా జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ వెడ్తూంటే, పెద్దపులి నెక్కినవాడు రయియమంటూవచ్చి అతడ్ని తొక్కేసి పోతాడు. నించుని నీళ్లు త్రాగుతాననే వాడు కూడా ఇట్టి ప్రమాదానికే గుర్రి అవుతాడు!

---

# సూర్యుడు మన శత్రువు

చిన్నప్పుడెప్పుడో కాశీమజిలీ కథల్లో చదువుకున్నాం - అదేదో పట్నంలో పగటివేళ సంచరించడం, పనులుచేయుడం అపరాధమనీ, రాత్రివేళ అంతా తమ పనులను చేసుకోవాలనీ, ఈ నిబంధనలను అతిక్రమించినవారు శిక్షార్హులనీ యిత్యాదయః, ఆ కథ చదివిన వెంటనే ఆ పద్ధతి అతి విచిత్రమైనదనీ, దాన్ని అమలులోకి తెచ్చిన ఆ పట్నపు రాజుగారు మతిభ్రష్టుడో, పగటి కలలుకనే స్వభావం కలవాడో అయి వుండాలనీ మనకు తోస్తుంది. కాని మన మనస్సులు తమ లేత స్వభావం నుండి తప్పుకుని, ముదిరి, బాగాముదిరి, అనేక అనుభవాలకు కరిగి, వడపోయబడి, తీర్పు చెప్పేశక్తిని సంపాదించుకునే పరిస్థితికి వచ్చేసరికి, ఆ విషయాన్ని గురించి చర్చించి చూస్తే అందులో అట్టే విచిత్రంలేదనీ, నిజానికి అంతా తమతమ పనులను పగటి వేళకంటే రాత్రివేళ చేస్తేనే బాగుంటుందనీ తెలియ వస్తుంది.

ఈ విషయం నేను కొత్తగా కనిపెట్టింది కాదు. అందరకూ తెలిసిందే. ఉష్ణప్రదేశాలలో పదార్థాలకు చలనం తక్కువ, నిద్ర ఎక్కువ, మీరు

ఎంత ప్రయత్నించి చూడండి, ఇండియా మొదలైన ఉష్ణప్రదేశాలలో ఏ కార్యక్రమమూకూడా అనుకున్న సమయానికి సక్రమంగా పూర్తికాదు. దీనికి కారణం మన ఎండలే. ప్రొద్దస్తమానం ఎండ, ఉక్క, చెమట, బద్ధకం, నిరుత్సాహం. భోజనంచేసి లేవడమే మన దేశంలో ఒక ఫీటు! అందులోనూ మనిషి కొంచం స్థూలంగా వుండే వాడైతే అతడు భోజనం చేసేటప్పటి ఆయాసం, అతడు కక్కే చెమట్లు, అతడు పడే ఆపసోపాలూ చిత్రాతిచిత్రంగా వుంటాయి. భోజనంచేసిన పిమ్మట అతడికి వచ్చేతిక్క, ఆ తిక్కను వదుల్చుకుందుకు అతడు చేసే ప్రయత్నాలూ, అనుభవించే బద్ధకం, తీసే ఆవలింతలూ, వేసే చిటికలూ, పడేకునుకుపాట్లూ, పోయే నిద్ర—ఈ తతంగమంతా ఎరగనివారంటూ వుండరు. భోజనానంతరం నిద్ర! ఎంత విచిత్రమైన కార్యక్రమం! దీనికి మన దేశంలో వున్నంత ప్రచారం, పలుకుబడి మరెక్కడా కనిపించదు. ఆమధ్య ఒక అమెరికన్ పత్రికలో 'మనం భుజించడందేనికి?' అనేశీర్షిక క్రింద అనేకమంది తమ అభిప్రాయాలను వ్రాశారు. అందులో ఉచితమైన అభిప్రాయం యిది: 'మనం భోజనం చేయడం దినకృత్యాలు నిర్వర్తించుకునేందుకు కావలసిన శక్తినీ, వేడినీ కలిగివుండటానికి' అనేది. ఆ అభిప్రాయాన్ని వెల్లడించింది ఒక విమాన కార్ఖానాలోని కార్మికుడు. అతడి అభిప్రాయానికి పత్రికవారు ప్రథమ బహుమానాన్ని యిచ్చారు. దాన్నిబట్టి మనదేశపు పరిస్థితులు చర్చించడానికి ఎంత మాత్రమూ వీలులేదు. ఇక్కడి పరిస్థితులూ, ఇక్కడి వాతావరణమూ వేరు. ఇక్కడ 'భోజనం చెయ్యడం ఎందుకయ్యా' అంటే 'నిద్రపోవడానికి' అనే సమాధానం సిద్ధంగా వుంటుంది! ఆ తప్పు నిద్రపోయేవారిది కాదు-వారిని నిద్రబుచ్చే ఉష్ణానిది.

సూర్యోదయాన్ని చూసి సంతోషించేవాళ్ళు మన దేశంలో ఎక్కడా కనపడరు. సూర్యుడు పొడుస్తున్నాడనే సరికే మంచాలమీద వుండే వారంతా తమ కేదో తీరని గండం సంభవిస్తుందని భావిస్తారు. ఇలా భావించడం వారి తప్పుకాదు, సూర్యుడిది-అందరి నిద్రలూ పూర్తిగా కుండానే మించిపోయినట్టుగా వచ్చిపడి, నిమిష నిమిషానికీ పదార్థాల

వేడిని వృద్ధిచేస్తూ, శరీరాలలో గాభరాను పుట్టిస్తూ, అనేకుల ఉసురు పోసుకునే సూర్యుడిది! బాగా సాయంత్రం అయితే తప్ప ఇతడు తన మారణహోమాన్నుంచి లేచిపోడు. అప్పటికి ప్రాణులు కొంచం చల్లబడి, శాంతించి కాస్త కుదుటపడతాయి. అంతవరకూ సూర్యుడ్నీ, ఎండనీ తిట్టని వాడంటూ మన ప్రాంతాల్లో కనపడడు.

పాశ్చాత్య దేశాల్లో పరిస్థితులు వేరు. అక్కడ శాస్త్రోక్తంగా సూర్యోదయం అవడమే పెద్ద గగనం. సూర్యుడు బాగా ప్రకాశించే రోజు పాశ్చాత్యులకు-ముఖ్యంగా-ఇంగ్లీషువారికి పర్వ దినం. ఆ రోజున వారు ప్రత్యేకపు విందులూ, విహారాలూ ఏర్పాటు చేసుకుంటారు. సాధారణంగా అక్కడ కాంతివంతమైన రోజు కనపడడమే అరుదు. కాగా, పాశ్చాత్యులెప్పుడూ సూర్యదర్శనంకోసం తపించిపోతూంటారు, మనం సూర్యాస్తమయం కోసం తపించినట్టుగా! నిజానికి, సూర్యుడు మనమీద ధాటీ చేసినట్లుగానే వారిమీదకూడా చేయడం మొదలెడితే వారుకూడా ఆ ధాటీకి తట్టుకోలేరనుకోండి. కాని, ఉన్నదానితో విసిగిపోయి ఉసురసురవడం, లేనిదానికోసం నోరుజాపుకు కూచోవడం మానవ స్వభావం. ఈ స్వభావాన్ని జయించే వెవరూ? ఆమధ్య ఒక అమెరికన్ రచయిత అన్నట్టు మనం హోటలులోవుంటే ఇంట్లోవుండే సుఖాలకోసం దేవుళ్ళాడతాం, ఇంట్లోవుంటే హోటలులోని సౌకర్యాల కోసం ఆశిస్తాం!

సూర్యుడు మనల్ని ఎందుకూ కొరగాని వాళ్ళనుగా చేశాడు. మన వాతావరణమే మన ఆశయాలకు తగినదిగా, ప్రోత్సహించేదిగా వుంటే మనజాతి ఈనాడు ప్రపంచ మంతటిలోను సాటిలేని జాతిగా వుండేది. అలాగని ఇప్పుడు మనం ఎందుకూ పనికిరాని వాళ్ళమని కాదు నా అభిప్రాయం. కాని, సూర్యుని ప్రకాశంముందు మనలోని కాంతి కిరణాలు క్షీణించలై కూర్చున్నాయి. ఉష్ణం మన కార్యక్రమాలకూ, ఆశయ సిద్ధికీ తగని శత్రువై కూర్చుని మనం వేసే ప్రతి అడుగుకూ ఒక అడ్డాన్ని ఏర్పరచి, మనకు ఆశాభంగాన్నీ, కాలవ్యవధినీ తెచ్చి పెడుతూంది.

ఆధునిక యుద్ధాలలో మన శత్రువుయొక్క శత్రువు మనకు మిత్రుడవడం కద్దు. అదేవిధంగా మన దేశంలో, సూర్యుడికి శత్రువు లెంతమంది వున్నారో అంతమందీ మన మిత్రులే అవడంలో వింత యేమీ లేదు. పది గంటలకుగాని పక్కమీంచి లేవని వారంతా యేనాడో సూర్యుడుమీద యుద్ధాన్ని ప్రకటించినవారే. భారతదేశపు గొప్ప నిస్పృహకూ, నిరాశకూ వీరు ప్రతినిధులు. నిజానికి వీరి స్థానంలో వుండేవారంతా తీరుబడి వర్గాలకు చెందినవారే కావచ్చును. కాని, తీరుబడిలేని వర్గాలవారుకూడా వాతావరణరీత్యా వీరి లక్షణాలనే అలవరుచుకుందుకూ, వీరికి మల్లేనే వుండటానికీ అవకాశం దొరికితే వెనుదీయరు. కాగా, మన దేశంలో వీరూ వారూ అనకుండా అందరూ, అన్నివర్గాలవారూ కూడా సూర్యుడికీ అతడి మారణకార్యక్రమానికీ వ్యతిరేకులే. సూర్యుడిని తొలగించే మార్గమేదైనా వుంటే వీరంతా తప్పకుండా తమకు చేతనైనంత సాయం చేస్తారు. కాని, సూర్యుడిని తొలగించలేమనేది మనకు తెలియనిది కాదు.

సూర్యుడి మూలంగా మనకు కలిగే ఇబ్బందిని తొలగించాలంటే ఒక్కటేమార్గం వుంది-అది సుబ్బన్న దీక్షితులుగారు కాశీమజిలీలలో రాసే వుంచారు. సూర్యుడిమీద మనం ఆంక్ష ప్రయోగించాలి. సూర్యుడు వెలిగినంతసేపూ మనం నల్లజండాలు ప్రదర్శించాలి-అంటే మంచాల మీంచి లేవకూడదు. సూర్యోదయం లగాయతు సూర్యాస్తమయం వరకూ మనకు నిద్రసమయంగా వుండాలి. సూర్యాస్తమయం లగాయతు తిరిగి సూర్యోదయంవరకు పాటుపడి పనిచేసే కాలం-హాయిగా చల్లగా, చెమటపట్టకుండా, ఉత్సాహంగా మనం పనిచెయ్యగలిగిన కాలం ఇదే. అందులోనూ వెన్నెలకాలమైతే మరీ హుషారుగా వుంటుంది.

కాలాన్ని ఒకగంట వెనక్కు మళ్ళించే ధైర్యసాహసాలు గల మన ప్రభుత్వం ఈ ఉపకారాన్నికూడా చేసి 'పగలంతా నిద్రపోయే కాలం-రాత్రంతా పనిచేసే కాలం' అని శాసిస్తే ఎంతో బావుండును!